

బీఆర్ఎస్ సీనియర్ నేత మాట్ల మధు, నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

# ప్రొటోకాల్ ఏది?

- కేటీఆర్ ఫొటో లేకుండానే అధికారిక కార్యక్రమమా?
- ప్రొటోకాల్ పాటించాలని బీఆర్ఎస్ నేతల పట్టు
- ప్రశ్నిస్తున్నవారిపైనే కాంగ్రెస్ నాయకుల దాడులు
- తాజాగా, సిరిసిల్లలో ఇందిరమ్మ ఇండ్ల పత్రాల పంపిణీ కార్యక్రమం వద్ద నిరసనకు యత్నం
- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని నేతల వెల్లడి

సిరిసిల్ల టౌన్, మే 25: సిరిసిల్ల నియోజకవర్గంలో నిర్వహించే అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని బీఆర్ఎస్ నాయకులు మండిపడుతున్నారు. ఆయా కార్యక్రమాల్లోని ఫ్లెక్సీలలో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఫొటో ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా ప్రశ్నిస్తున్న తమపైనే అధికార పార్టీ నాయకులు దాడులకు తెగబడుతున్నారని వాపోతున్నారు. ఇటీవల గంభీరావుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో కేటీఆర్ ఫొటో పెట్టాలని అడిగినందుకు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నేతలపై దాడి చేసిన విషయం తెలిసిందే. దీంతో బీఆర్ఎస్ నాయకులు ప్రొటోకాల్ ఉల్లంఘనపై జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు కూడా చేశారు. కాగా, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మరోసారి ప్రొటోకాల్ అంశం తెరపైకి వచ్చింది. ఇక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలోనూ కేటీఆర్ ఫొటో పెట్టకపోవడంతో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాట్ల మధు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో కళాశాల మైదానం వద్దకు చేరుకున్నారు. కార్యక్రమం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా సమాచారం తెలుసుకున్న పోలీసులు మాట్ల మధుతో పాటు నాయకులు సిలువేరి చిరంజీవి, తదితరులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేస్తాం

సిరిసిల్ల నియోజకవర్గంలో ప్రొటోకాల్ విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు బాధాకరమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాట్ల మధు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఫొటో ఏర్పాటు చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రొటోకాల్ అధికారి ఏకపక్ష ధోరణితోనే కేటీఆర్ ఫొటో పెట్టడంలేదన్నారు. వీరి వ్యవహారంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇప్పటికే ఈ విషయంపై తాము జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశామన్నారు. అయినప్పటికీ సిరిసిల్ల పట్టణ కేంద్రంలో జరిగిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలోనూ కేటీఆర్ ఫొటో ఏర్పాటు చేయలేదన్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘనపై మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

*- బీఆర్ఎస్ సీనియర్ నేత మాట్ల మధు*

# గోశాలలో గడ్డికట్టలకు రక్షణేదీ?

- అకాల వర్షాలతో తడిసిపోతున్న పశుగ్రాసం
- మురిగిపోతున్న వంద ట్రిప్పుల కట్టలు
- పట్టించుకోని అధికారులు



కవర్లు లేకపోవడంతో నాంపెల్లి గుట్ట వద్ద తడిసి ముద్దవుతున్న గడ్డి కట్టలు

వేములవాడ రూరల్, మే 25: రాజన్న ఆలయంలోని కోడెల కోసం నిత్యం భక్తులు గడ్డి కట్టలను అందిస్తుంటారు. ప్రస్తుతం రాజన్న కోడెల కోసం ఇచ్చిన గడ్డి కట్టలను నాంపెల్లి గుట్ట వద్ద ఉన్న ఆలయ స్థలంలో నిల్వ చేస్తున్నారు. ఇప్పటి వరకే దాతలు దాదాపు వందల ట్రిప్పుల గడ్డి కట్టలను నాంపెల్లి గుట్ట వద్ద ఏర్పాటు చేసిన స్థలంలో వేశారు. కవర్లు కప్పకపోవడం.. ప్రస్తుతం అకాల వర్షాలు పడుతుండడంతో గడ్డి కట్టలు పూర్తిగా తడిచిపోయి దుర్వాసన వస్తున్నాయి. అధికారులు నిర్లక్ష్యంగా గడ్డి కట్టలు మురిగిపోయి దుర్వాసన వస్తున్నాయని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోడెల సంరక్షణ కోసం భక్తులు అందించే గడ్డి కట్టలను కాపాడాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదంటూ మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గడ్డి కట్టలు నానకుండా, కోడెల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# నిరుపేదలకు అందని ఇందిరమ్మ ఇండ్లు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రుద్రంగి, మే 25: అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందడం లేదని, కాంగ్రెస్ కార్యకర్తలకే వస్తున్నాయని సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీపై ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇండ్లు ఇవ్వకుండా మోసం చేస్తుందన్నారు. ఇండ్ల జాబితాలో అనర్హుల పేర్లు తొలగించి అర్హులకే ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధాన్యం తడిచి మొలకలు రావడంతో ప్రశ్నించిన రైతల పేర్లను ఇందిరమ్మ ఇండ్ల జాబితా నుంచి తొలగించారన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి మ్యాచర్ వచ్చిన ధాన్యం తడిచి మొలకలు రావడంతో రైతులకు నష్టం వాటిల్లుతున్నా పట్టించుకోరా అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నష్టపోకుండా తడిచిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో రుద్రంగిలో అభివృద్ధి జరుగలేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రుద్రంగిలో రోడ్డు వెడల్పు పనులు, సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్, రైతు వేదిక, డంప్ యార్డు, స్మశాన వాటిక, కేజీబీవీ పాఠశాల, బండమీద బడి, హెల్త్ సబ్ సెంటర్లు, దసరా నాయక్‌తండాకు రోడ్డు, కులసంఘాలకు నిధులు వంటి ఎన్నో అభివృద్ధి పనులు బీఆర్ఎస్ హయాంలో జరిగాయన్నారు. రుద్రంగిలో ప్రభుత్వ స్థలం లేకనే డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు చెప్యాల గణేశ్, నాయకులు గంగం మహేశ్, మంచె రాజేశం, కొడగంటి శ్యామ్, నాగులపెల్లి రవి, అల్లూరి గంగారెడ్డి, కాదాసు లక్ష్మణ్, తలారి నర్సయ్య, గొల్లెం నర్సింగ్, దయ్యాల నారాయణ, గంగాధర్, గంగారెడ్డి, ఊరడి రవి, పెద్దులు, కొండయ్య, సత్తయ్య, నర్సయ్య, మల్లయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సహకారం అందించాలి

కోనరావుపేట, మే25: సేంద్రియ పంటలను పండించే రైతులను ప్రభుత్వం ప్రోత్సహించి పంటల మార్కెట్ కోసం యార్డ్‌ను ఏర్పాటు చేయాలని దశరథ సేంద్రియ వ్యవసాయ క్షేత్రం నిర్వాహకుడు, ధర్మారం గ్రామస్తుడు మూగాల ఆదర్శ్ కుమార్ కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను స్థానిక రైతులతో కలిసి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సానుకూలంగా స్పందించిన విప్.. తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు మల్లేశం, రాజు, శేఖర్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ ఉద్యోగుల్లో గుబులు

- ప్రభుత్వానికి చేరిన ఏసీబీ నివేదిక!
- గతేడాది ఆగస్టులో ఆకస్మిక సోదాలు
- సరుకుల్లో వ్యత్యాసాలు.. అవకతవకల గుర్తింపు
- తొమ్మిది నెలల తర్వాత తాజాగా సర్కారుకు చేరిన రిపోర్టు
- ఆలయ అధికారులు, ఉద్యోగుల్లో కలవరం



వేములవాడ రాజన్న ఆలయంలోని గోదాములో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు (ఫైల్)

వేములవాడ, మే 25: సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయంలో గతేడాది ఏసీబీ ఆకస్మిక తనిఖీలకు సంబంధించి పూర్తిస్థాయి నివేదిక ప్రభుత్వానికి చేరినట్లు తెలుస్తున్నది. ఆలయంలోని పలు విభాగాల్లో అవకతవకలు జరుగుతున్నట్లుగా వచ్చిన ఫిర్యాదుల్లో భాగంగా గతేడాది ఆగస్టులో ఏసీబీ అధికారుల బృందం ఆకస్మిక తనిఖీ చేసిన విషయం తెలిసిందే. రెండు రోజులపాటు సమగ్రంగా సోదాలు చేసి గోదాములో 24 రకాల సరుకుల నిలువలు, వ్యత్యాసాలు, పలు విభాగాల్లో అవకతవకలు, కల్యాణ కట్టలో నగదు వసూలు జరుగుతున్నట్లు గుర్తించిన అధికారులు, అప్పట్లో బహిరంగంగానే సామాజిక మాధ్యమాల్లో ప్రకటించారు. గోదాములో కాజు 144 కిలోలు, బియ్యం 908 కిలోలు, బేసిన్ అట్ట 26 కిలోలు, ఆయిల్ 4 కిలోలు, నెయ్యి 981 కిలోలు, కిస్మిస్ 88 కిలోలు వీటితోపాటు మరో 13 సరుకులు నిలువలు ఎక్కువగా ఉన్నాయని, ఎండు కారం మిర్చి, ఆవాలు తదితర సరుకుల నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించి, పరిశీలించి నివేదిక రూపొందించినట్లు తెలుస్తోంది. ఇంజినీరింగ్ విభాగంలోనూ అనుమతి లేకుండా అడ్డగోలుగా టెండర్లు నిర్వహించారని గుర్తించారు. ఈ క్రమంలో తనిఖీలు చేసిన తొమ్మిది నెలల తర్వాత దాదాపు 25 పేజీలతో పూర్తి నివేదికను రూపొందించడంతోపాటు శాఖల వారీగా ఉద్యోగులు వారి వివరాలను ప్రభుత్వానికి అందించినట్లు సమాచారం.

### ఆందోళనలో రాజన్న అధికారులు, ఉద్యోగులు

ఏసీబీ రిపోర్టు ఆధారంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉండగా అధికారులు, ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఏసీబీ అధికారుల చర్యలు ఏ విధంగా ఉండబోతాయనే అంశంపై ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతున్నట్లు తెలుస్తుంది. నగదు పట్టుబడే సమయంలో తీసుకునే చర్యల్లాగానే, వ్యత్యాసాలను కూడా అవినీతిగా భావించి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందనే కోణంలో ఉద్యోగులు వేదనకు లోనవుతున్నట్లు తెలిసింది. ఏదేమైనా ఆలయంలో అవకతవకలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

### పెండింగ్‌లో 2023 విజిలెన్స్ రిపోర్ట్

ఆలయంలో 2023లో జరిగిన విజిలెన్స్ తనిఖీలకు సంబంధించిన రిపోర్టు ప్రస్తుతం ప్రభుత్వానికి అందాల్సి ఉంది. 2021లోనూ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి నివేదిక ఇవ్వగా, ఆలయంలో 12 మంది ఉద్యోగులపై వేటు పడింది. పదోన్నతులు, ఇంక్రిమెంట్లను నిలిపివేస్తూ శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. 2023 విజిలెన్స్ నివేదికలు కూడా ప్రభుత్వానికి చేరితే మరికొందరిపై వేటు పడే అవకాశం ఉన్నది.

## తాళం వేసిన ఇండ్లే టార్గెట్

వేములవాడ, మే 25: పట్టణంలో తాళం వేసిన ఇండ్లనే దొంగలు టార్గెట్ చేస్తుండగా పట్టణ ప్రజలు భయాందోళన గురవుతున్నారు. ఇటీవల వేములవాడ సబ్ డివిజన్‌లోనూ దొంగలు హల్‌చల్ చేస్తుండగా.. ఇటు పట్టణంలోనూ రెచ్చిపోతున్నారు. 20 రోజుల క్రితం మార్కండేయనగర్‌లో తాళం వేసిన ఇంట్లో దొంగలు చేరబడి బంగారం, నగదును కాజేశారు. ఇంటి యజమాని బయటకు రాకుండా గడియపెట్టి పై అంతస్తులో చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి సెస్ ఆఫీస్ పక్కన గల వీధి, సాయినగర్‌లోనూ తాళం వేసి ఉన్న నాలుగు ఇండ్లలో చోరీకి పాల్పడి మరింత భయాందోళనకు దారి తీస్తున్నారు. రెండు దుకాణాలు, రెండు నివాసాల్లో చోరీకి పాల్పడగా, బంగారు ఆభరణాలు, కొంత నగదు ను ఎత్తుకెళ్లారు. నిత్యం గస్తీ కాసే ప్రాంతంలోనే దొంగలు చేతివాటాన్ని ప్రదర్శిస్తుండడం పోలీసులకు సవాలుగా మారింది.

## కార్పొరేట్ దుకాణాలు ఏర్పాటు చేయనివ్వద్దు

ముస్తాబాద్, మే 25: గ్రామాల్లో కార్పొరేట్ దుకాణాలతో కుల వృత్తులపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్న వారి బతుకులు ఆగమై రోడ్లపై పడే అవకాశం ఉన్నందున వారి షాపుల ఏర్పాటుకు అనుమతి ఇవ్వదని సర్వకారుల సంఘం మండలాధ్యక్షుడు చింతోజి బాలయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో మండల స్వర్ణకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మండల కేంద్రంలో పెట్టుబడిదారులు బంగారం దుకాణాలు ఏర్పాటుకు చేస్తున్న ప్రయత్నాలు సరికాదని, అధికారులు స్పందిచి దుకాణాలకు అనుమతులు ఇవ్వద్దని కోరారు.





చందుర్తి/బోయినపల్లి రూరల్: సమ్మేళనంలో నాటి ఉపాధ్యాయులతో కలిసి పాల్గొన్న పూర్వ విద్యార్థులు

# ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు
- విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సత్కారం



రుద్రంగి: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రుద్రంగి/వేములవాడ రూరల్/బోయినపల్లి రూరల్/చందుర్తి, మే 25: జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. రోజంతా ఉత్సాహంగా గడిపి సందడి చేశారు. తర్వాత విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. రుద్రంగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పూర్వ విద్యార్థుల (2004-2005లో ఎస్సెస్సీ బ్యాచ్) మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరిగింది. ఒకరినొకరూ ఆపాయ్యంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకుని రోజంతా ఆనందంగా గడిపారు.

- చందుర్తి మండలం సనుగుల ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థుల (2004-05లో ఎస్సెస్సీ బ్యాచ్) సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యార్థులు నేర్పించిన గురువులను వారు సన్మానించారు.

### 26ఏండ్ల తర్వాత కలుసుకుని..

వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల(1998-99లో ఎస్సెస్సీ బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు 26ఏండ్ల తరువాత ఒకచోటికి చేరి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం దివంగతులైన ఉపాధ్యాయులకు నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

### 20ఏండ్ల తర్వాత ఒక్కటై..

బోయినపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల (2005-06లో పదో తరగతి బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రస్తుతం వృత్తి, ఉద్యోగం, కుటుంబ బాధ్యత వంటి కారణాలతో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా 20ఏండ్ల తర్వాత కలుసుకున్నారు. ఆ తర్వాత అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.

# పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



ముస్తాబాద్: లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

రాజన్న సిరిసిల్ల, మే 25 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టినట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 764మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేసి, మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నాలుగు విడుతల్లో రూ.5లక్షల ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. 400 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ సాయాన్ని పొంది తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఆకాంక్షించారు. కాగా, ప్రభుత్వం ఇండ్ల నిర్మాణాల్లో పురోగతి ప్రకారం పారదర్శకంగా నిధులు విడుదల చేస్తుందన్నారు. ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇల్లు కట్టుకోలేని నిరుపేదలకు మెప్మా నుంచి రుణం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూపారెడ్డి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, హౌసింగ్ పీడీ శంకర్, శేషాద్రి, మున్సిపల్ కమిషనర్ వాణి, కేకే మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముస్తాబాద్, మే 25: మండలంలోని మాతృశ్రీ గార్డెన్‌లో వివిధ గ్రామాలకు చెందిన 491మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రొసీడింగ్ పత్రాలను కలెక్టర్‌తో పాటు కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఏఎంసీ చెర్‌పర్సన్ తలారి రాణి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు, పీడీ శేషాద్రి శంకర్, ఎంపీడీవో బీరయ్య, తహసీల్దార్ సురేశ్ పాల్గొన్నారు.

## ముగిసిన శిక్షణ తరగతులు

ఇల్లంతకుంట, మే 25: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయని ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న విషయాలను పాఠశాలల్లో అమలు చేయాలని పేర్కొన్నారు. సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు.

## నిత్యాన్నదాన సత్రానికి విరాళం

వేములవాడ టౌన్, మే 25: శ్రీ పార్వతీ రాజ రాజేశ్వర స్వామివారి నిత్యాన్నదాన సత్రానికి ముస్తాబాద్ మండలం రాజక్కపేటకు చెందిన కోమటి రెడ్డి రాజిరెడ్డి-సరిత దంపతులు ఆదివారం ₹లక్ష విరాళాన్ని ఏఈవో శ్రావణ్‌కుమార్‌కు అందజేశారు. తమ ఇలవేల్పు అయిన స్వామివారి దర్శనానికి ప్రతి ఏటా వస్తుంటామని వారు తెలిపారు.

## ముచ్చర్లకు ఆర్టీసీ బస్సు

గంభీరావుపేట, మే 25: ముచ్చర్ల గ్రామానికి సిరిసిల్ల డిపో నుంచి ఆదివారం బస్సు సేవలను ప్రారంభించారు. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా వేములవాడ నుంచి ముచ్చర్ల మీదుగా సిద్దిపేట జిల్లా దుబ్బాకకు బస్సును నడిపించనున్నారు. దీంతో గ్రామస్తులు మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యోగం రాదేమోనని..


- మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



సంపత్ (ఫైల్)

గంభీరావుపేట, మే 25: ఇక తనకు ఉద్యోగం రాదేమోనని మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ ప్రేమానందం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గుడికాడి సంపత్ (23) బీటెక్ పూర్తి చేసి.. ఉద్యోగం కోసం పలు కంపెనీల్లో ఇంటర్వ్యూలకు హాజరవుతున్నాడు. అయితే అర్హత సాధించకపోవడంతో తనకు ఉద్యోగం రాదేమోనని మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంపత్ తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## సులభ పద్ధతుల్లో బోధించాలి: డీఈవో



వేములవాడ: మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో జనార్దన్‌రావు

వేములవాడ, మే 25: విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ పద్ధతుల్లో పాఠాలు బోధించాలని జిల్లా ఇన్‌చార్జి డీఈవో జనార్దన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఐదు రోజులపాటు ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి డీఈవో హాజరై, మాట్లాడారు. చిన్నారుల్లో సామర్థ్యాన్ని పెంపొందించే విధంగా వారికి అర్థమయ్యే సులభ పద్ధతుల్లో బోధించాలన్నారు. పాఠశాల స్థాయిలో నైపుణ్యంగా విద్యను అందించినప్పుడే విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బన్నాజీ, జిల్లా రిసోర్స్‌పర్సన్ స్వరాజ్యలక్ష్మి, మధు, శిక్షణ ఆర్గనైజర్ బొజ్జ కృష్ణ, రిసోర్స్‌పర్సన్లు కమలాకర్‌రెడ్డి, చక్రపాణి, రామచంద్రం, నిర్మల, సీఆర్పీ ఆకుల శ్రీనివాస్ ఉన్నారు.

బోయినపల్లి రూరల్, మే 25: ఐదు రోజులపాటు మండల కేంద్రంలో ప్రాథమిక ఉపాధ్యాయలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమం ఆదివారం కొదురుపాకలో ముగిసింది. ఈ కార్యక్రమనికి ఇన్‌చార్జి డీఈవో జనార్దన్‌రావుశర్మ హాజరయ్యారు. ఉపాధ్యాయ శిక్షణ అనంతరం బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకొని పాఠశాల అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం కొదురుపాక, విలాసాగర్ ఎస్సీ కాలనీ పాఠశాల హెచ్ఎంలు బీ రెడ్డి, ఎన్ శోభారాణి పదవి విరమణ పొందడంతో వారిని సత్కరించారు. ఇక్కడ డైట్ ప్రిన్సిపాల్ మొండయ్య, ఎంఈవో శ్రవణ్, హెచ్ఎం బొలగం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, మండల రిసోర్స్‌పర్సన్, తదితరులు ఉన్నారు.



మోహినికుంటలో పాల్గొన్న కేటీఆర్ సేన నాయకులు

## ఎన్నికల హామీలు అమలు చేయాలి

- కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్

ముస్తాబాద్, మే 25: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేదంటే ప్రజలతో కలిసి ఆందోళనలు చేస్తామని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, మండల యూత్ అధ్యక్షుడు శీలం స్వామి పేర్కొన్నారు. మోహినికుంటలో ఆర్‌బీఎస్ మండల మాజీ అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు నివాసంలో ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల కేటీఆర్ సేన కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను, ప్రజలను వంచిస్తున్న తీరును గ్రామస్థాయిలో ఇంటింటికెళ్లి అవగాహన కల్పించాలన్నారు. మెంగని మనోహర్ మాట్లాడుతూ, కేసీఆర్‌ను మరోసారి సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఇక్కడ కేటీఆర్ సేన మండలాధ్యక్షులు వంగూరి దిలీప్, నందగిరి భాస్కర్‌గౌడ్, సాకీర్, మండల కమిటీ నేతలు కరెడ్ల మల్లారెడ్డి, భూక్యా మధు, మనీష్, నర్సింహులు, నాగరాజు, రవీందర్, మహేశ్, నరేంద్రాచారి, సతీశ్, సురేశ్, మహేశ్, గణేశ్, రాజేశ్, సంతోష్, నరేందర్, భాను, ఉన్నారు.

## బీఆర్ఎస్ నేతల సంఘీభావం



తంగళ్లపల్లి ఠాణాలో బీఆర్ఎస్ సీనియర్ నేత మధు, నాయకులు

సిరిసిల్ల రూరల్, మే 25: సిరిసిల్లలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ నేపథ్యంలో ప్రొటోకాల్‌పై పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు సిరిసిల్లలో అదుపులోకి తీసుకుని తంగళ్లపల్లి ఠాణాకు తరలించారు. ఈ క్రమంలో తంగళ్లపల్లి ఠాణాలో ఉన్న బీఆర్ఎస్ సీనియర్ నేత మాట్ల మధు, కేటీఆర్ సేన మండలాధ్యక్షుడు నందగిరి భాస్కర్‌గౌడ్, బీఆర్ఎస్ తంగళ్లపల్లి పట్టణాధ్యక్షుడు బండి జగన్, నాయకులు సిలువేరి చిరంజీవి, గుండు ప్రేమ్‌కుమార్, అఫ్రోజ్, కడారి నవీన్‌రెడ్డిని పార్టీ తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న వెళ్లి సంఘీభావం తెలిపారు. ప్రొటోకాల్‌పై పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకోవడం సరైందికాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఫొటో లేకుండా, కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డిని పక్కన కూర్చొబెట్టుకుని అధికారిక కార్యక్రమాలు నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు.

## అకాల వర్షాలు.. అడవిపందుల దాడులు

- అన్నదాతకు తప్పని తిప్పలు



అడవి పందులు ధ్వంసం చేసిన వరి ధాన్యం రాశులు

చందుర్తి, మే 25: మండల వ్యాప్తంగా నాలుగు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి కల్లాల్లో వర్షపు నీరు పేరుకుపోయి ధాన్యం కొనుగోళ్లకు అంతరాయం ఏర్పడింది. దీనికి తోడు తాజాగా అడవి పందుల బెడద అన్నదాతలను కుదేలు చేస్తున్నది. లింగంపేట గ్రామానికి చెందిన రైతు ఆలూరి లక్ష్మణ్‌రావుకు చెందిన ధాన్యం రాశులపై శనివారం రాత్రి అడవిపందులు వీరవిహారం చేశాయి. గ్రామ శివారును అనుకొని అటవీ ప్రాంతం విస్తరించి ఉండడంతో అడవి పందులు, కోతులు, తదితర వన్యప్రాణులు సరిహద్దు గ్రామాల్లోని ధాన్యం రాశులను ధ్వంసం చేస్తున్నాయి. నెలలు దాటిన ధాన్యం సేకరించకపోగా వన్యప్రాణులు సైతం వంటను ధ్వంసం చేసి తీవ్రంగా నష్టం కలిగిస్తున్నాయని రైతులు వాపోయారు.

## శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లంతకుంట, మే 25: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోచ్ దాసరి శివరాం కోరారు. మండల కేంద్రంలో 25రోజులుగా కొనసాగుతున్న క్రీడా శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. శిబిరంలో వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా కృషిచేయాలి

కోనరావుపేట, మే 25: శిక్షణలో నేర్చుకున్న విషయాలు పాఠశాలలో అమలు చేస్తూ విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో మురళినాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నాలుగు రోజులుగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్‌పై శిక్షణ నిర్వహించగా, ఆదివారంతో ముగిసింది. ఇక్కడ ఆర్పీలు జంగిటి రాజు, శ్రీధర్, తిరుపతి, గోషికొండ శ్రీనివాస్, బాలకిషన్, గాలిపెల్లి సంతోష్, రేండ్ల అనిల్‌బాబు, మహేశ్, తదితరులు ఉన్నారు.

## ముగిసిన ఓరియంటేషన్ శిక్షణ

ఎల్లారెడ్డిపేట, మే 25: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక ఉపాధ్యాయుల ఓరియంటేషన్ శిక్షణ తరగతులు ఆదివారం ముగిసినట్లు ఎంఈవో కృష్ణహరి తెలిపారు. ముగింపు సమావేశంలో శిక్షకులు ప్రాథమిక ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఇక్కడ స్కూల్ కాంప్లెక్స్‌హెచ్ఎం మనోహరచారి ఉన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించాలి

బోయినపల్లి రూరల్, మే 25: ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని బీఆర్ఎస్ నాయకుడు గండ్ల సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన జన్మదినం సందర్భంగా గ్రీన్ ఇండియా హరిత సేన కార్యక్రమంలో భాగంగా తన వ్యవసాయ క్షేత్రంలో కుటుంబ సభ్యులు స్నితిక, రియన్సికతో కలిసి సతీశ్‌కుమార్ మొక్కలు నాటారు. ఇక్కడ మాజీ సర్పంచ్ చిందం రమేశ్, నేతలు బుర్ర రాజు, చిందం శశి, కనకయ్య, హరిత సేన సభ్యుడు కమల్‌గౌడ్ ఉన్నారు.

## అదనపు సిబ్బందిని నియమించాలి

వేములవాడ, మే 25: రాజన్న ఆలయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు సిబ్బందిని నియమించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ఈవో వినోద్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రతి కార్మికుడికి నేషనల్ పే స్కేల్ ప్రకారం రూ.26వేల వేతనం ఇవ్వాలన్నారు. ఇక్కడ ఆలయ కార్మికులు కేతవ్వ, లచ్చవ్వ, దేవవ్వ, మల్లేశ్వరి, వరవ్వ, సరోజన, భాగ్యలక్ష్మి, తదితరులు ఉన్నారు.

## విద్యుత్‌షాక్‌తో మేకపోతు మృతి

కోనరావుపేట, మే 25: బావుసాయిపేట గ్రామంలో గొర్రెల కాపరి తిక్కల జగన్‌కు చెందిన మేకపోతును రోజువారిగా మేతకు తీసుకువెళ్లగా, ప్రమాదవశాత్తూ విద్యుత్‌షాక్ తగిలి మృతిచెందింది. సుమారు రూ.20వేల విలువైన మేకపోతును నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు. సెస్ అధికారులు తగిన నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.